నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, ఆదివారం 21 జూలై 2024 | NALGONDA

కోర్టుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి

- ఆగస్టులో జూనియర్ సివిల్ కోర్టును ప్రారంభిస్తాం
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోవర్ధన్‌రెడ్డి

హుజూర్‌నగర్ : న్యాయస్థానాల నిర్మాణాలకు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోవర్ధన్‌రెడ్డి

హుజూర్‌నగర్/ కోదాడ టౌన్, జూలై 20 : హుజూర్‌నగర్, కోదాడ కోర్టుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం హుజూర్‌నగర్, కోదాడ కోర్టులను పరిశీలించేందుకు వచ్చిన ఆయనకు సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్, జూనియర్ సివిల్ జడ్జి మారుతీప్రసాద్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి భవ్య పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్జి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ కోర్టులో 8వేలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అన్ని కేసులను పరిష్కరించడం ఒక్క న్యాయమూర్తితో సాధ్యం కాదని, పెండింగ్ కేసులను తగ్గించేందుకు అదనపు జూనియర్ సివిల్ కోర్టును మంజూరు చేసినట్లు తెలిపారు. ఆగస్టులో జూనియర్ సివిల్ కోర్టును ప్రారంభిస్తామని, కోర్టులో తాగునీటి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని అన్నారు. అనంతరం అదనపు జూనియర్ సివిల్ కోర్టు ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రామస్వామి గుట్ట వద్ద న్యాయస్థానాలు, న్యాయమూర్తుల నివాస గృహ భవన సముదాయాల నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. వాటి నిర్మాణాలకు అంచనా వ్యయాల నివేదికను హైకోర్టుకు పంపనున్నట్లు తెలిపారు. కోదాడలో కొత్తగా నిర్మించనున్న కోర్టు స్థలాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. భవనాన్ని నాణ్యతతో నిర్మించాలని, నాణ్యత లోపించకుండా బార్ అసోసియేషన్ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. అనంతరం ఆయా కోర్టుల్లో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తిని సన్మానించారు. కార్యక్రమాల్లో హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి జక్కుల వీరయ్య, కోదాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గట్ల నరసింహారావు, ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి, కోదాడ పట్టణ సీఐ రాము, ఎస్ఐ మల్లేశ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

యాదగిరీశుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి మౌషిమి భట్టాచార్య

యాదగిరిగుట్ట, జూలై 20 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టీస్ మౌషిమి భట్టాచార్య కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. శనివారం యాదగిరి కొండకు చేరుకున్న న్యాయమూర్తికి అర్చకులు ఆలయ సంప్రదాయరీతిలో ఘన స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి నేరుగా గర్భాలయంలో స్వయంభూ పంచనారసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. దర్శనానంతరం అర్చకులు వారికి వేదాశీర్వచనం చేశారు. ఆలయ ఈఓ భాస్కర్‌రావు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

హైకోర్టు న్యాయమూర్తి మౌషిమి భట్టాచార్యకు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఈఓ భాస్కర్‌రావు

పట్టాదారుడికి కాదు... కుటుంబానికే రుణమాఫీ

రేషన్‌కార్డే ప్రామాణికం అంటున్న అధికారులు

సీఎం చెప్పినట్టు ప్రతి పట్టాదారుడికి రుణమాఫీ లేనట్లే

ఆ ప్రకారమే లక్ష లోపు రుణమాఫీ జాబితా

అందుకే 40శాతం మించని లబ్ధిదారుల సంఖ్య

ఎంత వీలైతే అంత కుదించేందుకు సర్కారు కుట్రలు

తీవ్ర ఆందోళనలో రైతాంగం

కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై రైతుల మండిపాటు

నల్లగొండలోని యూనియన్ బ్యాంక్‌లో తమ ఖాతాలను చెక్ చేసుకుంటున్న రైతులు

రైతాంగంపై కాంగ్రెస్ సర్కారు కపట ప్రేమకు సాక్ష్యంగా రెండు లక్షల రుణమాఫీ పథకం నిలుస్తున్నది. రుణం తీసుకున్న ప్రతి రైతుకూ 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేస్తామని ఎన్నికల్లో ఊదరగొట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు మొండిచెయ్యి చూపుతుండడం చర్చనీయాంశంగా మారింది. అప్పుడు అందరికీ అని చెప్పి... ఇప్పుడు చడీచప్పుడూ లేకుండా కొర్రీలు పెడుతున్నది. సాధ్యమైనంత మేరకు లబ్ధిదారుల సంఖ్యను తగ్గించి ఆర్థిక భారం తగ్గించుకునేందుకు కుట్రలు చేస్తున్నది. అందుకే పట్టాదారు పాస్‌పుస్తకం ప్రాతిపదికను అటకెక్కించింది. కేవలం రేషన్‌కార్డు ఆధారంగా ఒక కుటుంబానికి గరిష్టంగా 2 లక్షల రూపాయల రుణమాఫీ వర్తింపజేయాలంటూ ఆదేశాలిచ్చింది. ఇదే విషయం శనివారం నల్లగొండ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రవణ్‌కుమార్ కూడా స్పష్టం చేయడం గమనార్హం. దాంతో మూడింట రెండొంతుల మందికి రుణమాఫీ రాదన్న చర్చ సర్వత్రా సాగుతున్నది.

– నల్లగొండ ప్రతినిధి, జూలై 20 (నమస్తే తెలంగాణ)

రుణమాఫీ విషయంలో ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి చెప్తున్న మాటలకు, క్షేత్రస్థాయిలో అమలు జరుగుతున్న తీరుకు పొంతన లేకపోవడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పట్టాదారు పాస్‌పుస్తకం ఆధారంగానే రుణమాఫీ అమలు చేస్తామని పైకి ప్రకటించి క్షేత్రస్థాయిలో మాత్రం రేషన్‌కార్డు ఆధారంగా కుటుంబానికి 2లక్షల రుణమాఫీ అని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. అందుకే పెద్ద సంఖ్యలో రుణమాఫీ లబ్ధిదారుల సంఖ్యలో కోత పడింది. క్షేత్రస్థాయిలో బ్యాంకర్లు, సహకార సొసైటీల అధికారులు కూడా రేషన్‌కార్డు ఆధారంగానే రుణమాఫీ జరిగిందని చెప్తున్నారు. ఫలితంగా రుణమాఫీపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులపై కాంగ్రెస్ సర్కార్ నీళ్లు చల్లినట్లైంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు నాలుగు లక్షల మంది వరకు లక్ష లోపు రుణాలు తీసుకున్న రైతులు ఉంటారని అంచనా. ఇందులో 1.76లక్షల మందికే రూ.941 కోట్లను రుణమాఫీ వర్తింపచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో కేసీఆర్ సర్కార్ 99,999 రూపాయల వరకే 4లక్షల పైచిలుకు రైతులకు రూ.2150 కోట్ల వరకు రుణాలను మాఫీ చేసింది. ఆ లెక్కన చూస్తే రుణమాఫీలో పెద్దఎత్తున కోతలు పెట్టినట్లు స్పష్టమవుతుంది. ఒక్క సూర్యాపేట జిల్లాను పరిశీలిస్తే.. ఇక్కడ రూ.2లక్షల వరకు రుణాలు తీసుకున్న రైతులు 2.53లక్షల మంది ఉన్నట్లు గతంలో అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. వారందరికీ రుణమాఫీ వర్తింపజేస్తే రూ.3,350 కోట్ల వరకు వెచ్చించాలి. ఇందులోనే లక్ష లోపు రుణాలను పరిశీలిస్తే సుమారు 1.75లక్షల మందికి రూ.1,300 కోట్ల వరకు రుణాలు మాఫీ కావాల్సి ఉంది. కానీ గురువారం ప్రకటించిన జాబితా ప్రకారం కేవలం 56,274 మందికి రూ.282.98కోట్ల రుణాలే మాఫీ అవడం గమనించాల్సిన విషయం. వాస్తవ అంచనాలో 25శాతం వరకు కూడా రుణమాఫీ జరగడం లేదని స్పష్టమవుతున్నది. ఇదే విషయంపై అధికారిక సమాచారం కోసం ఎవరిని సంప్రదించినా ఎవ్వరూ నోరు మెదపని పరిస్థితి నెలకొంది.

రేషన్ కార్డు లేకుంటే అంతేనా!

రెండ్రోజులుగా రుణమాఫీ వర్తించని రైతులంతా బ్యాంకులకు, సొసైటీలకు బారులు తీరుతున్నారు. ఇక్కడ అధికారులు వాస్తవాలు చెప్పక తప్పడం లేదు. తమకు అసలు, వడ్డీ కలిపి లక్ష రూపాయల లోపే ఉన్నా ఎందుకు మాఫీ కాలేదంటే మీ కుటుంబంలో మరొకరికి కూడా అప్పు ఉంది కాబట్టి ఇద్దరికీ కలిపి లక్ష దాటితే రుణమాఫీ ఇప్పుడు ఉండదని కుండబద్దలు కొడుతున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలను పరిశీలిస్తే రేషన్‌కార్డు ఆధారంగానే మాఫీ చేస్తున్నారని సొసైటీ అధికారులు చెప్తున్నారు. ఇదేవిధంగా ఒక కుటుంబంలో ఎంతమంది రుణాలను తీసుకున్నా అందరికీ కలిపి గరిష్టంగా రెండు లక్షల రుపాయల వరకు మాఫీ జరుగుతుందని కూడా స్పష్టం చేస్తున్నారు. ఇక రేషన్‌కార్డులో పేర్లు లేని రైతులకు రుణమాఫీని పక్కన పెట్టేశారు. ఇలాంటి వారి సంఖ్య కూడా గణనీయంగానే ఉంది. వీటన్నింటి వల్ల రుణమాఫీపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులు ఇప్పుడు బాధపడుతున్నారు. రుణం తీసుకున్న ప్రతి రైతుకూ రెండు లక్షల వరకు రుణమాఫీ అని ఎన్నికలప్పుడు చెప్పి... ఇప్పుడు మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత రెండు సీజన్లలోనూ కాలం కాక పంటలు సరిగ్గా పండక ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న రైతులకు కాంగ్రెస్ సర్కార్ తీరు మరింత ఆందోళనకరంగా మారింది.

కుటుంబానికి 2 లక్షల రుణమాఫీ

- **శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి, నల్లగొండ**

ఒక కుటుంబానికి రెండు లక్షల వరకే రుణమాఫీ వర్తించేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని నల్లగొండ జిల్లా వ్యవసాయ శాఖాధికారి పి.శ్రవణ్‌కుమార్ వెల్లడించారు. శనివారం తన కార్యాలయంలో ఓ టీవీ ఛానల్‌తో మాట్లాడుతూ కుటుంబాల నిర్ధారణకు రేషన్ కార్డునే ప్రాతిపదికగా తీసుకున్నారని చెప్పారు. పలు అంశాలపై శ్రవణ్‌కుమార్ స్పందిస్తూ... 'ప్రభుత్వం క్లియర్‌గా చెప్పింది. కుటుంబం ప్రాతిపదికన ఒక్కో కుటుంబానికి రెండు లక్షల రుణమాఫీకి జీఓ విడుదల చేసింది. 18వ తేదీన జిల్లాలో లక్ష లోపు రుణం ఉన్న 83వేల మందికి రూ.454 కోట్లను విడుదల చేశారు. 80వేల మందికి ఇప్పటికే డబ్బు జమైంది. లక్ష లోపు రుణం ఉండి కూడా మాఫీ కాకుంటే ఆధార్ కార్డు తీసుకుని వస్తే రైతులకు కారణాలు చెప్తున్నం. కుటుంబంలో ఇంకో సభ్యుడితో కలిపి లక్ష రుణం దాటితే మాత్రం రెండో దఫాలో రుణమాఫీ రావచ్చు. కుటుంబాల నిర్ధారణకు రేషన్ కార్డునే పరిగణలోకి తీసుకున్నారు. కొన్ని అకౌంట్లలో కుటుంబాలను కలిపి చూడడంలో సమస్యలు ఉన్నాయి. గతంలో రుణాలు తీసుకుని తిరిగి చెల్లించిన వారికి రుణమాఫీ వర్తించదు' అని స్పష్టం చేశారు.

లోన్ లక్షలోపే ఉన్నా మాఫీ కాలేదు

మాది తిరుమలగిరి మండలం లోని తాటిపాముల గ్రామం. నేను రూ.65 వేలు, నా కొడుకు రాకేశ్ రూ.60 వేలు వేర్వేరు పట్టాదారు పాస్ పుస్తకాలతో నాగార్జున గ్రామీణ బ్యాంకులో రుణం తీసుకున్నాం. ప్రభుత్వం లక్షలోపు రుణం తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ చేసింది. కానీ.. మా పేర్లు మాత్రం ఆ లిస్టులో లేవు. రేషన్ కార్డులు వేరుగా లేనందున మాఫీ కాలేదా.. అనుకుంటే మా ఊరిలో ఒకే రేషన్ కార్డులో పేరు ఉన్న ఇద్దరికీ రుణమాఫీ అయ్యింది. మాకు కూడా రుణమాఫీ జరుగుతుందని ఎంతో ఆశపడ్డాం. కానీ.. మాకు మాత్రం మాఫీ కాలేదు.

- యామగాని శారద, తాటిపాముల, తిరుమలగిరి మండలం, సూర్యాపేట జిల్లా



నల్లగొండ జేడీఏ ఆఫీస్‌లో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రైతుల రుణమాఫీపై రెండు నిమిషాల్లో అప్‌డేట్ చేయాలి

- రెండు నెంబర్లతో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి కాల్స్ రిసీవ్ చేసుకోవాలి
- రుణమాఫీ అయ్యిందా.. లేదా? అనేది రైతులకు డీఏఓ ఆఫీసు నుంచే కన్ఫర్మ్ చేయాలి
- వ్యవసాయ అధికారులకు కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం
- మూడ్రోజులుగా ఆఫీసుకు రాని ఏఓ సస్పెన్షన్

నల్లగొండ, జూలై 20 : రుణమాఫీ విషయం రైతులకు రెండు నిమిషాల్లో తెలియజేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రుణమాఫీ సెల్ ఏర్పాటు చేశారా.. లేదా? అని తెలుసుకునేందుకు శనివారం జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయానికి ఆయన వచ్చారు. అయితే.. అక్కడ ఒక టేబుల్, ఏడీఏ, మరో ఏఓ మాత్రమే ఉండి రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను రిజిష్టర్‌లో నమోదు చేసుకునే సెట్ ఏర్పాటు చేశారు. ఫిర్యాదులు రిజిష్టర్‌లో కాదు.. రెండు సెల్ నెంబర్లు ఇచ్చి జిల్లాలో వచ్చిన ప్రతి కాల్ లిస్ట్ చేసి వాటిని రెండు నిమిషాల్లోనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఒక్క టేబుల్, ఇద్దరు అధికారులతో ఏం చేస్తారని ప్రశ్నించారు. కాల్స్ రిసీవ్ చేసుకొని వాటిని నమోదు చేసుకోవడానికి నలుగురు, పర్యవేక్షణ, యాప్‌లో ఎప్పటికప్పుడు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు మరో నలుగురు ఉండాలని ఆదేశించారు. వెంటనే ఈ సెటప్ ఏర్పాటు చేయాలని ఏడీఏ హుస్సేన్‌బాబును ఆదేశించారు. కలెక్టర్ సూచనతో జేడీఏ మరో ఫిర్యాదు పరిష్కారానికి వెళ్లగా, ఆయనతో ఫోన్‌లో మాట్లాడి ఆదేశాలు జారీ చేశారు. రైతులు ఆఫీస్‌కు వచ్చినా.. ఫోన్ చేసినా వెంటనే స్పందించి రెండు నిమిషాల్లో రుణమాఫీ అవుతుందా.. లేదా.. దానికి గల కారణం తెలుపుతూ సమాధానం చెప్పాలని ఆదేశించారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నెంబర్ 7288800023తోపాటు మరో నెంబర్‌ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఆఫీసుకు రాని ఏఓ సస్పెన్షన్

వ్యవసాయ శాఖలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పని చేస్తున్న అబ్దుల్ మన్నన్ మూడు రోజులుగా అనుమతి తీసుకోకుండా ఆఫీస్‌కు రాకపోవడంతో శనివారం ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ నారాయణరెడ్డి సస్పెండ్ చేశారు. విదేశాలకు వెళ్లే పనుల్లో ఉండి ఆఫీస్‌కు రాకుండా ఉన్న ఆయనపై సస్పెన్షన్ వేటు పడింది. రుణమాఫీ ప్రత్యేక సెల్ ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన కలెక్టర్ రిజిష్టర్‌ను పరిశీలించగా.. ఈ విషయం తన దృష్టికి రావడంతో ఆయనను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

రోజంతా ముసురు

జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షం

పానగల్‌లో వర్షంలో వరి నారుతో బతుకమ్మ ఆడుతున్న మహిళా కూలీలు

నల్లగొండ, జూలై 20 : జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిన్న మొన్న చిరుజల్లులు కురువగా శనివారం అంతటా ముసురు పెట్టింది. శుక్రవారం రాత్రి నుంచి ఈదురు గాలులతో మోస్తరు వర్షం పడడంతో మెట్ట పంటలకు జీవం పోసినట్లయింది. దాంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వరి నాట్లకు, పత్తి చేలకు మందు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. నల్లగొండ జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు సగటున 1.4 సెంటీమీటర్ల వర్షం పడింది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నకిరేకల్‌లో 125.8 మి.మీ. వర్షం పడగా, కేతెపల్లిలో 11.5, తిప్పర్తిలో 11.3, మునుగోడులో 11.3, శాలిగౌరారంలో 10, నల్లగొండలో 9.3, కట్టంగూర్‌లో 9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మిగతా మండలాల్లో ఎనిమిది మి.మీ.లోపు వర్షం పడింది.

ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు సెలెక్షన్స్ వాయిదా

బొడ్రాయిబజార్, జూలై 20 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆదేశాల మేరకు ఆదివారం మిర్యాలగూడలో నిర్వహించనున్న ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఓపెన్ సెలెక్షన్స్ ట్రయల్స్‌ను వర్షాల కారణంగా వాయిదా వేస్తున్నట్లు ఉమ్మడి నల్లగొండ జిల్లా సెక్రటరీ నాయిని శ్రీనివాస్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి సెలెక్షన్స్ నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 9490999316లో సంప్రదించాలని సూచించారు.

జిల్లా జైల్ సూపరింటెండెంట్‌గా ప్రమోద్

ప్రమోద్‌కు స్వాగతం పలుకుతున్న దేవ్లా

నీలగిరి/ నల్లగొండ సిటీ, జూలై 20. నల్లగొండ జిల్లా జైలు సూపరింటెండెంట్‌గా జి.ప్రమోద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. నల్లగొండ జైలు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎల్.దేవ్లా సాధారణ బదిలీల్లో భాగంగా చంచల్‌గూడ జైలుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నిజామాబాద్‌లో పనిచేస్తున్న జి.ప్రమోద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

మూసీ ప్రాజెక్టుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

మూసీ లోతట్టు ప్రజలను అప్రమత్తం చేయాలి

- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన అందించాలి
- సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

సూర్యాపేట రూరల్, జూలై 20 : ఎగువన వర్షాలు పడుతున్నందున మూసీ లోతట్టు ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలోని మూసీ ప్రాజెక్టును శనివారం ఆయన సందర్శించి నీటి నిల్వలు, సామర్థ్యాన్ని పరిశీలించారు. గేట్ల పనితీరు, తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్ శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం టేకుమట్ల గ్రామంలో జడ్పీహెచ్ఎస్, ప్రైమరీ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి భోజనం, ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మంచి ఆహారంతో పాటు నాణ్యమైన విద్యా బోధన అందించాలని, అధ్యాపకులు విధుల పట్ల నిబద్ధతతో ఉండాలని సూచించారు. వర్షాకాలంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట తాసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ వేణుగోపాల్, ఏఈ ఉదమ్‌కుమార్ ఉన్నారు.

బహిరంగ మార్కెట్ ధర ఇవ్వాల్సిందే

- నేషనల్ హైవే 930 భూ నిర్వాసితుల డిమాండ్

భూదాన్‌పోచంపల్లి, జూలై 20 : తమ భూములకు ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో ఎకరానికి రూ.2కోట్ల ధర పలుకుతున్నదని, ప్రభుత్వం ఎకరానికి రూ.25 నుంచి 28లక్షలు మాత్రమే ఇస్తే తాము భూములు ఇవ్వలేమని భూ నిర్వాసితులు అధికారులకు తేల్చి చెప్పారు. గౌరెల్లి నుంచి భద్రాచలం వరకు నిర్మించనున్న జాతీయ రహదారి 930లో భూములు కోల్పోతున్న పిలాయిపల్లి, జగత్‌పల్లి గ్రామాల రైతులతో చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశమయ్యారు. రైతుల నుంచి అభ్యంతరాలు, అభిప్రాయాలను సేకరించారు. రంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వం ఎకరానికి రూ.42 లక్షలు ఇస్తుండగా తమ భూములకు తక్కువ ఎలా ఇస్తారని రైతులు అధికారులను ప్రశ్నించారు. అన్ని జిల్లాల్లో సమానంగా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ భూ నిర్వాసితులకు ఎకరానికి రూ. 28 లక్షల వరకు పరిహారం అందిస్తామన్నారు. పిలాయిపల్లిలో 57 మంది రైతుల వద్ద 30.02 ఎకరాలు, జగత్‌పల్లిలో 25 మంది రైతుల నుంచి 10.6 ఎకరాల భూమిని సేకరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తాసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సురేందర్ శర్మ, ఎంఆర్ఐ గుత్త వెంకట్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

రైతులతో సమావేశమైన అధికారులు